## ఘనంగా అల్లూరి జయంతి



చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఎస్‌కె రబ్బానీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, భూగర్భ జలాల శాఖ డిడి గంగాధర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి పద్మనాభం, జిల్లా మత్స్యశాఖ ఎడి డి.రవీంద్రారెడ్డిలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగుతుల సంక్షేమశాఖ, గిరిజన, సాంఘీక సంక్షేమ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# సత్వరం నీట్ రద్దు

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్

### విద్యా సంస్థలు బంద్ చేసి విద్యార్థుల నిరసన



నీట్ పరీక్షను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన.

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:
నీట్ పరీక్షను రద్దు చేయాలని దేశ వ్యాప్యంగా విద్యాసంస్థల బంద్ పిలుపు నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో గురువారం విద్యాసంస్థలు మూత పడ్డాయి. విద్యార్థులు నీట్ పరీక్షను సత్వరం రద్దు చేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్, యుజిసి నెట్ పేపర్ల లీకేజీల నిర్లక్ష్యానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపుఇచ్చిన విషయం తెలిసిందే. ఎఐఎస్ఎఫ్ విద్యాసంస్థల బంద్ పిలుపు నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో గురువారం పూర్తి స్థాయిలో విద్యా సంస్థలు మూతపడ్డాయి. కొన్ని విద్యా సంస్థలు బంద్ స్వచ్ఛంధంగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించి ఎఐఎస్ఎఫ్ బంద్‌కు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా జిల్లా ఎఐఎస్ఎఫ్ కన్వీనర్ మాట్లాడుతూ విద్య, వైద్యంతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తన వైఖరీని మార్చుకుని పేద, మధ్య, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేటువంటి పద్ధతుల్లో పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరం నీట్ పరీక్షలు రద్దే చేసి ఈ పరీక్షను నిర్వహించిన ఎన్టీఎ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, నీట్ పరీక్షా విధానంను రద్దు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పరీక్ష నిర్వహించడానికి విధుల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఆయన కోరారు. లేకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ సంఘ నాయకులు రోహిత్, సురేష్, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# బదిలీలెప్పుడో !?

### పోలీసు,రెవెన్యూ అధికారుల్లో గుబులు



ప్రభాతవార్త-తిరుపతి:
విద్యాసంవత్సరం కూడా ఆరంభమవడంతో చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో పోలీసు,రెవెన్యూ శాఖల్లో పలు హోదాల్లో పనిచేస్తున్న అధికారులు,ఉద్యోగులు బదిలీలు ఎప్పుడనే గుబులు వీడటం లేదు. సాధారణంగా విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యాశాఖతోబాటు పోలీసు, రెవెన్యూశాఖల్లో ఉద్యోగులు, అధికారులు బదిలీలు జరగడం పరిపాటి. ఈ ఏడాది అందుకు భిన్నంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. దీంతో అన్ని ప్రభుత్వ శాఖలతోబాటు ప్రధానంగా పోలీసు,రెవెన్యూశాఖల అధికారులు,ఉద్యోగుల బదిలీల పై ఫోకస్ పెట్టడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాల్లో గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో, పెద్దలతో చట్టపట్టాలు వేసుకు తిరిగిన అధికారులు, ఉద్యోగులు బదిలీలు తప్పవనే నిర్ధారణకు వచ్చేశారు. మరీ ముఖ్యంగా పోలీసు,రెవెన్యూశాఖల్లో ఈ తతంగం మరీ ఎక్కువే. మారిన నూతన ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు నచ్చిన, నిజాయితీ అధికారులు ఎవరనేది ఆరా తీసి వారిని తమతమ ప్రాంతాల్లో నియమించుకునేందుకు చూస్తున్నారు. పోలీసుశాఖలోనూ కానిస్టేబుళ్ళు నుండి హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలు, ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలు, అదనపు ఎస్పీలు బదిలీలు కానున్నారు. వీరంతా బాగా వైసిపి పెద్దలతో చట్టపట్టాలు వేసుకుని తిరిగి వారు చెప్పినట్లు తప్పుడు కేసులు నమోదు చేసి నయానా భయపెట్టిన వారు ఉన్నారు. అలాంటివారందరినీ ఇప్పుడు ఉన్నచోటు నుండి తప్పించి తమ వారికి పోస్టింగ్‌లిప్పించుకునేందుకు చూస్తున్నారు. తిరుపతి జిల్లాలో అన్ని పోలీసుస్టేషన్‌లలో ఎస్ఐలు, సిఐలు బదిలీల పూర్తిస్థాయిలో ప్రక్షాళన తప్పదనేది టిడిపి నేతలు,జనసేన నేతలు చెబుతున్నారు. ఇదే విషయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పోలీసుశాఖ ప్రక్షాళన చేస్తానని చెప్పారు. దీంతో ఆయన సొంత జిల్లాలో ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నియమించిన ఎస్పీలు కొనసాగుతున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీతో బాటు అదనపు ఎస్పీలు, డిఎస్పీలు,సిఐలు పూర్తిస్థాయిలో ప్రక్షాళన ఉంటుందనేది చర్చ సాగుతోంది. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లను మార్చి వారి స్థానాల్లో కొత్తవారిని నియమించిన విషయం విదితమే. ఇప్పుడు ఐపిఎస్ అధికారుల బదిలీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు బదిలీ తప్పదనేది ప్రభుత్వ పెద్దల్లో వినిపిస్తున్న విషయం. ఇప్పటికే ఈ రెండు జిల్లాల టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు ఎస్పీల బదిలీల అంశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి మార్పు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇంకా వైసిపి అధికారులుగా బ్రాండ్‌వేసుకున్న సిఐలు, ఎస్ఐలు, డిఎస్పీలు బదిలీ అనివార్యం. మరీ ఈ బదిలీలు త్వరగా చేపడితే ఇక్కడ నుండి వెళ్ళిపోతామని, తమ పిల్లల చదువులు, కుటుంబం మార్పు వంటివి మధ్యలో తలనొప్పి వ్యవహారమని అంటున్నారు. మరీ మరో రెండుమూడు రోజుల్లో పోలీసు శాఖలో బదిలీలు ఉంటాయనేది తెలుస్తోంది. మరీ ఈరెండు జిల్లాల్లో ఎందరు బదిలీవేటుకు గురవుతారనేది ఉత్కంఠగా మారింది.

### తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ వెంకటేశ్వర్లు

# బాధ్యతల స్వీకరణ



తిరుపతి కార్పొరేషన్, జులై 4, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా కలెక్టర్‌గా డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో గతంలో కలెక్టర్లు అనేక సమస్యలను పరిష్కరించి ఉంటారని, తిరుపతి నూతన జిల్లా ఏడు నియోజకవర్గాలతో పారిశ్రామిక గ్రామీణ పట్టణ వాతావరణం కలిగిన జిల్లా అని, తిరుపతి జిల్లాలో సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతనిస్తూ జిల్లాను అందరి సహకారంతో సమన్వయంతో ప్రగతి పథంలో నడిపిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా సమర్ధవంతంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తిరుమల ఏడుకొండల స్వామి వారు కొలువై ఉన్న తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అమలు చేసి, పరిశ్రమలు నెలకొల్పడానికి, పరిశ్రమల అభివృద్ధికి ఎక్కువగా అవకాశాలు ఉన్న జిల్లాగా పారిశ్రామిక అభివృదద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాన చంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్, డిఆర్ఓ పెంచల కిషోర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఆర్డిఓలు తదితరులు కలెక్టర్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

# రెవెన్యూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త
ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు, సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత మండలాల తహశీల్దార్లు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలసి కుప్పం మండల కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుంచి అర్జీల రూపంలో 600వినతులు అందగా అందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 436 ఫిర్యాదులు జిల్లా కలెక్టర్‌కు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందించే వివిధ సామాజిక పెన్షన్లకు అర్హులైన లబ్దిదారులకు పెన్షన్ మంజూరుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతులు అందజేసిన ప్రజలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ శాఖకు 436వినతులు అందగా పంచాయతీరాజ్ 29, హౌసింగ్ 23,డిఎస్ఓ 18, డిఆర్‌డిఎ 16, ఎంపిడిఒలు 15, పోలీసుశాఖ 8, డిఇఒ 5, కుప్పం రెస్కో 4, ఇరిగేషన్ 3, హెచ్ఎస్ఎస్ఎస్ 3, డిఎల్‌డిఒ 3 ఇతర శాఖలకు ఒక్కోటి వంతున వినతులు కలెక్టర్‌కు అందాయి. కాగా ఉదయం నుంచే కుప్పం మండల పరిషత్ కార్యాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలతో కిటకిటలాడింది. కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ మణిక ంఠ చ ందోలు, డ్వామా, డిఆర్‌డిఎపిడిలు రాజశేఖర్, తులసి, డిఎల్‌పిఒ రవికుమార్, సిపిఓ సాంబశివారెడ్డి, కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

**అమరావతి నిర్మాణంకు విరాళం** : రాజధాని అమరావతి నిర్మాణం కోసం గుడుపల్లె మండలం పొగురుపల్లికి చెందిన శంకర్‌రెడ్డి రూ 5116లు విరాళంగా అందించారు. ఈ మేరకు గురువారం కుప్పంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సంబంధిత చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డ్వామా పిడి రాజశేఖర్, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### సంక్షేమ,అభివృద్ధి ఫలాలను

# ప్రజలకు చేరువచేస్తా

### నూతన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:
రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువచేసి, సమతుల్యతతో అందించేలా పనిచేస్తానని తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ప్రజలకు సేవలందిస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో పనిచేసే అవకాశం కలగడం ఆనందంగా ఉందని అన్నారు. తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. సాంప్రదాయంగా స్వామివారి సన్నిధిలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం టిటిడి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర ఉన్నారు.

## 45 ఎర్రచందనం దుంగలు పట్టివేత

పుత్తూరు, జూలై 4 ప్రభాతవార్త :



తమకందిన రహస్య సమాచారం మేరకు అక్రమంగా రవాణా జరుగుతున్న ఎర్రచందనం దుంగలను దాడి చేసి పట్టుకున్నట్టు అటవీ శాఖ రేంజ్ అధికారి మాధవి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తెలిపిన మేరకు... కెవిబి పురం నుంచి పిచ్చాటూరు వైపు గస్తీ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో టిఎన్ 20డిహెచ్ 2826 నెంబరు బొలెరో వాహనం మారప్పరెడ్డికండ్రిగ గ్రామం వెనుక వైపు అనుమానాస్పదంగా పంట పొలాల వద్ద అటవీ ప్రాంతం దగ్గరగా వెళుతుండగా అటవీ సిబ్బంది దానిని అనుసరించారు. కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఎర్ర చందనం దుంగలను వాహనంలో లోడ్ చేస్తుండగా గమనించి అక్కడకు చేరుకోగా సిబ్బందిని గమనించిన ఆ వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి ఒకరిని సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం వాహనంలో 327.9 కేజీలు బరువున్న 45 ఎర్రచందనం దుంగలను వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎఫ్ఎస్ఒ ఆర్.ఎస్.చైతన్య, ఎఫ్‌బిఒలు ఎం.సురేష్ కుమార్, నీలకంఠ, సిబిఇటి సిబ్బంది గోపి, రఘు, మహేంద్ర, సింహాద్రి, ప్రవీణ్,కార్తీక్, బోగరాజు,బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 10 నుండి 12వ తేదీ వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ ఆగమో క్తంగా నిర్వహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాన్న వెంకన్న ఆలయంలో ఈ నెల 10 నుండి 12 వరకు స్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవాలు వైభవంగా నిర్వహించ తలపెట్టారు. ఇందులో భాగంగా ఆలయంలో వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా జరిపించారు. ఉదయం 6.30 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాక్షాత్కార వైభవోత్సవాలలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించనున్నారు. 10న పెద్దశేష వాహనం, 11న హనుమంత వాహనం, 12న గరుడ వాహనంపై స్వామివారు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపట్టు వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జులై 4, ప్రభాతవార్త



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఎనలేనిదని వారి జయంతి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి మహోత్సవ సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసి ధ్యాన చంద్ర, తిరుపతి మునన్సిపల్ కమిషనర్ అధితి సింగ్, అధికారులతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాంజలి ఘటించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మహనీయుని దేశభక్తి ఎనలేనిదని వారి గొప్పదనాన్ని అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పలువురు పుష్పాంజలి ఘటించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీలపై సర్వే పంజా

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త
అపారమైన గ్రానైట్ ఖనిజ సంపద కలిగి ఉన్న చిత్తూరు జిల్లాలో ప్రైవేట్ యాజమాన్యాలు నిర్వహిస్తున్న గ్రానైట్, గ్రావెల్ క్వారీలపై ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. చిత్తూరు జిల్లాలో నిర్వహణలో ఉన్న, ఆగిపోయిన గ్రానైట్ క్వారీలకు సంబంధించి పూర్తిస్థాయిలో లెక్కలు తీస్తున్నారు. ఈ మేరకు అటు మైనింగ్, ఇటు రెవెన్యూ అధికార యంత్రాంగం సర్వేయర్లతో కలసి గ్రానైట్ క్వారీలను సర్వే చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని కుప్పం, చిత్తూరు, జిడి నెల్లూరు, నగరి తదితర ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్, గ్రావెల్ క్వారీల సర్వేలు జరుగుతున్నాయి. దీంతో అక్రమ క్వారీయింగ్ చేసిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. చిత్తూరు జిల్లాలో దాదాపు మైనర్ మినరల్స్‌కు సంబంధించి 665 లీజులను భూగర్భగనుల శాఖ అనుమతులు ఇచ్చినట్లు జిల్లా ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీటితో పాటు ఇంకా ఎవరైనా అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారా, అక్రమంగా గ్రానైట్‌ను తరలించారా, క్వారీల హద్దులు దాటి పనులు చేపట్టారా అనే అంశాల్లో అధికార బృందాలు సమగ్ర సర్వే చేపడుతున్నాయి.

కుప్పంపై స్పెషల్ ఫోకస్ : చిత్తూరు జిల్లాలోనే అత్యధికంగా కుప్పం నియోజకవర్గం గ్రానైట్ సంపద కలిగి ఉంది. ఈ ప్రాంతంనుంచి గ్రానైట్ విదేశాలకు ఎగుమతి అవుతుంది. ఇక్కడి గ్రానైట్‌కు



దేశవిదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో గ్రానైట్ సంపద వ్యాపించి ఉంది. అత్యధికంగా శాంతిపురం మండలంలో ఉంది. గత 50-60 ఏళ్లుగా కుప్పం ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ విస్తరించిఉంది. కాగా ఈ నియోజకవర్గంలో అత్యధికంగా గ్రానైట్ క్వారీలను వ్యాపారులు నడుపుతున్నారు. పలువురు క్వారీలను తమిళనాడుకు చెందిన వ్యక్తులకు లీజులకు సైతం ఇచ్చారు . వైఎస్సార్సీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక కుప్పం నుంచి గ్రానైట్ అక్రమ రవాణా జరుగుతోందని, కుప్పంలో ఇష్టారాజ్యంగా అనుమతుల్లేని క్వారీలు నిర్వహించడం జరుగుతోందని 2022 సం॥జనవరినెలలో ప్రస్తుత సిఎం, అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు శాంతిపురం మండలం సి.బండపల్లి వద్దగల

### అక్రమ మైనింగ్.. గ్రానైట్ తరలింపులపై పక్కా లెక్కలు .. కుప్పంపై స్పెషల్ ఫోకస్ !!

గ్రానైట్ క్వారీలను పరిశీలించి అక్కడే ధర్నా చేశారు. ఈ ప్రాంతంలో అక్రమ క్వారీయింగ్ జరుగుతోందని గ్రానైట్ సంపదను వైకాపా నేతలు కొల్లగొడుతున్నారని పేర్కొన్నారు. తదనంతరం మైనింగ్ శాఖ అధికారులు కుప్పంలో గ్రానైట్ క్వారీలను తనిఖీ చేసి పలు క్వారీలకు సంబంధించిన వాహనాలు, అక్రమ తరలింపుకు సిద్ధంగా ఉన్న గ్రానైట్‌ను సీజ్ చేశారు. కొన్నాళ్లపాటు గ్రానైట్ తరలింపు, క్వారీల నిర్వహణ నిలిచిపోగా తదన ంతరం మరలా గ్రానైట్ తరలింపు యథేచ్ఛగా కొనసాగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కుప్పంతో పాటు జిల్లాలో ఉన్న గ్రానైట్ క్వారీలపై కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో ఉన్న క్వారీల లెక్కలు, అక్రమ గ్రానైట్ తరలింపు వ్యవహారాలు ఓ కొలిక్కి తేవాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గుడుపల్లె మండలంలో తనిఖీలు చేసిన అధికారులు అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు జరిపారని నిర్ధారించారు. ఏది ఏమైనా త్వరలోనే జిల్లాలో గ్రానైట్ క్వారీల వ్యవహారంలో అక్రమ తవ్వకాలు, తరలింపుల లెక్కలను పూర్తిస్థాయిలో అధికారులు తేల్చనున్నారు.

## సుబ్రహ్మణ్యంరాజుచే పుంగనూరులో అన్నదానం

పుంగనూరు, జూలై 4 ప్రభాతవార్త:



ప్రజలకోసం జీవితాలను అంకితం చేసినపుడే మనుషులు మహాత్ములుగా కీర్తించబడుతారని రాజంపేట పార్లమెంటరీ దేశం నాయకుడు సుబ్రహ్మణ్యంరాజుఅన్నారు. గురువారం పుంగనూరు రాజుక్ష త్రీ యసేవాసంఘం అధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరిసీతారామరాజు తన జీవితాన్ని దేశస్వాతంత్ర్యం కోసం త్యజించారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నేటితరంలో ప్రజల ఆస్తులను కాజేయాలని చూసిన వంచక పాలకులకు ప్రజలు బుద్ధిచెప్పి అల్లూరిసీతారామరాజు పౌరుషానికి వారసులుగా ప్రకటించుకున్నారని అన్నారు. సంఘ అధ్యక్షుడు భక్తవత్సలరాజు అల్లూరిసీతారామరాజు సమరప్రతిభను కొనియాడారు. ఈసందర్భంగా సుబ్రహ్మణ ్యంరాజు అధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సీతాపతిరాజు,గ్రామీణబ్యాంక్ మేనేజర్ ప్రభాకర్‌రాజుతో పాటూ హిందూజాగరణ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి,బిజెపి నాయకులు సిఎస్ రాజారెడ్డి,క్షత్రీయసంఘస్తులు భాస్కర్‌రాజు,ప్రభాకర్,రెడ్డెప్ప,రామకృష్ణమరాజు,సుబ్రహ్మణ ంరాజు,రవిరాజు,జ్యోతిరాజు,శంకర్‌రాజు,సతీష్‌కుమార్,లక్ష్మణ్,ఈశ్వర్,సుదర్శన,శివ,శ్రీధర్,నారాయణ,మల్లికార్జునరాజులు పాల్గొన్నారు.

## శ్రీతిరుపతి గంగమ్మ ఆలయాన్ని పరిశీలించిన సహాయ కమీషనర్.. స్థపతి

కుప్పంరూరల్, జూలై 4 ప్రభాతవార్త



జిల్లాలో ప్రసిద్ది చెందిన కుప్పం శ్రీ తిరుపతి గ ం కమీషనర్ ప్రసన్న లక్ష్మి, డిప్యూటీ స్థపతి నెహ్రూ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంకు సంబంధించి ముత్తుమారెమ్మ ఆలయాలను పునర్నిర్మించనున ఈసందర్భంగా సహాయ కమీషనర్ ప్రసన్న లక్ష్మి కుప్పం నియోజకవర్గంలో ఉన్న పది ఆలయ చేపడుతున్నామన్నారు. కుప్పంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం, గుడివంక శ్రీ వల్లీదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయం, పెద్దవంక శ్రీ కనకనాశమ్మ, రాళ్లబూదుగూరు శ్రీ కోదండరామాలయం, కుప్పం శ్రీ బేటరాయస్వామి కొండ, మల్లప్ప కొండ, యామనూరు, కర్లగట్టలోని శ్రీధర్మరాజుల ఆలయం, రామకుప్ప ంలోని సుబ్రమణ్యస్వామి ఆలయం, కంగుంది ఆలయాలను అభివృద్ధి చేసేందుకు తగు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం టిడిపి సమన్వయకమిటీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మున్సిపల టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఎఇ ఆనంద్, సహాయ స్థపతి దుర్గా ప్రసాదరావు, అర్చకులు సోముస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకై జిల్లా కలెక్టర్‌కు చైర్మన్ వినతి

కుప్పంరూరల్, జూలై 4 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కుప్పం మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ కోరారు. కుప్పం మండల కార్యాలయంలో ప్రజా ఫిరా ్యదుల పరిష్కార వేదికలో పాల్గొన్న జిల్లా కలెక్టర్‌ను చైర్మన్ కలిసి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత మూడు నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో పాటు చిన్న చిన్న అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వెంటనే కౌన్సిల్ సమావేశం జరిగేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమీషనర్ నేతృత్వంలో ప్రతినెలా కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలి

**తవణంపల్లె, జూలై 4 ప్రభాతవార్త:** వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించాలని స్థానిక ఎస్సై ఎం.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం చిత్తూరు–అరగొండ రహదారిలోని కె.పట్నం ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 1 నుండి అమలు చేస్తున్న మోటారు వెహికల్ ఆక్ట్‌పై అవగామన కల్పిం చారు. ఈమేరకు ఎవరైనా వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం వుండడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున ఎక్కువగా వస్తుంటాయని ఈనేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనిల్‌కుమార్ హెచ్చరించారు.

## నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

**చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశమందిరంలో నిర్వహించనున్నట్లు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, కో–అప్షన్ సభ్యులతో పాటు పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## గంగమ్మ హుండీ ఆదాయం రూ.2.24 లక్షలు



**శ్రీరంగరాజుపురం, జులై 4 ప్రభాతవార్త:** ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమాను గంగమ్మ హుండీ లెక్కింపు గురువారం గంగమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో 2,24,808 రూపాయల ఆదాయం లభించిందని ఆలయ ఇఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ హుండీ ద్వారా వచ్చిన ఆదాయంను అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నామన్నారు. గతంలో మార్చి 20వ తేదీ హుండీ లెక్కింపు జరిగిందని, అప్పటి నుండి గంగమ్మకు హుండీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.2.24 లక్షలు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకటాచలపతి, ధర్మకర్త లింగారెడ్డి, డైరెక్టర్ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

బంగారుపాళ్యం, జులై 4 ప్రభాతవార్త:

మండలంలోని నలగాంపల్లి గ్రామ పంచాయతీ ఎన్‌పి నగర్‌కు చెందిన పిఎం చిరంజీవి(40) గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఇతను గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన ఇతను వేకువజామున ఇంటిలోని మోల్డింగ్ కమ్మికి దారంతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఎస్‌ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంను శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ఆసుపత్రి వద్ద మృతదేహంను సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించారు. కాగా మృతుడికి భార్య, పిల్లలు వున్నారు.

## మృతురాలి కుటుంబానికి మైనారిటీ నాయకుడి ఆర్థికసాయం

తవణంపల్లె, జూలై 4 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ గ్రామ పంచాయతీ నల్లప్పరెడ్డిపల్లెలో పేద మృతురాలి కుటుంబానికి రాష్ట్ర మైనారిటీ నాయకులు స్థానిక మాజీ సర్పంచ్ జి.కరీం గురువారం ఆర్థికసాయం అందించారు. నల్లప్పరెడ్డిపల్లె గ్రామ ఎస్సీవాడకు చెందిన కాళెమ్మ అనే మహిళ గురువారం మృతి చెందింది. దీనితో ఎన్నికలకు ముందు గ్రామస్థులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గ్రామంలో ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలలో వివాహం జరిగినా లేక ఎవరైనా మృతి చెందినా తన వంతు సాయంగా ఐదు వేల రూపాయలను ఆందిస్తామని ఇచ్చిన హామీ మేరకు మృతురాలి కుటుంబానికి ఐదు వేల రూపాయలు దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందించారు. కరీం తరపున ఫైమాగం టి.ప్రశాంత్‌కుమార్, బాబుల చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో నాగరాజు, బాబు, మణి,హరి, మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి విప్లవపంథానే దాస్యవిముక్తికి మూలం

–దేశం నాయకుడు సివిరెడ్డి

పుంగనూరు,జులై 4 ప్రభాతవార్త:

బ్రిటీష్‌గుండెలకు దడ నేర్పించిన విప్లవసిం హం అల్లూరి సీతారామ రాజు భారతదేశ దాస్య విముక్తికి మూలస్తంభమని,ఆయన ఆదర్శంతోనే పుంగనూరులో విప్లవాత్మకమైన అభివృద్దిని చేపడుతామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సివి రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆయన మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అల్లూరి సీతారామరాజు 127వ జయంతిలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంతకాలం పుంగనూరు నియోజకవర్గంలో జరిగిన దౌర్జన్యం అవినీతిపై ప్రజలు పూరించిన విప్లవశంఖమే తమ నాయకుడు చల్లాబాబు అన్నారు. చల్లాబాబు సారధ్యంలో మున్సిపాలిటీలో విప్లవాత్మకమైన విధివిధానాలు,ప్రజాసంక్షేమం,అధికారులపనితీరు,వ్యవస్థ బాగోగులు పర్యవేక్షించడానికి సిద్దంగా ఉన్నామన్నారు. కమీషనర్ నర్సింహప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన నేతలను స్మరించుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది, దేశం నాయకులు పాల్గొన్నారు.



**టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ ఎన్..చంద్రశేఖరన్ శ్రీవారి దర్శనానికి తిరుమలకు చేరుకున్నారు. టిసిఎస్ అధ్యక్షుడు రాజన్న ఉన్నారు. టిటిడి ఈఓ శ్యామలరావు ఆత్మీయస్వాగతం పలికారు.**
ప్రభాతవార్త–తిరుమల

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిన్నతనం నుంచి ఆంగ్ల భాషపై పట్టు

పాకాల, జూలై 4, ప్రభాతవార్త



చిన్నతనం నుండే విద్యార్థులలో ఆంగ్లం పట్ల ఉండే భయాన్ని తొలగించాలని తిరుపతి జిల్లా పాకాల మండల విద్యా శాఖధికారి బాబ్జి అన్నారు. ఆయన గురువారం మండలంలోని పచ్చిపాలపల్లి, అగ్రహారం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఇంగ్లీషు పట్ల ఉండే భయాన్ని తొలగించాలని అన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు కొన్ని ఆంగ్ల పదాలు, వాక్యాలు నేర్పించాలని కోరారు. చిన్న చిన్న ఆంగ్ల వాక్యాలు వారి దగ్గర చెప్పించాలని అన్నారు. గ్రామర్ పార్ట్ కూడా వారి చేత రాయించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు ఇంటి పని కింద ఒక పాఠంలోని పదాలు, వాక్యాలు ఇచ్చి వాటిని ఉపాధ్యాయులు చూడాలని కోరారు. అదే విధంగా విద్యార్థుల చేత వర్క్ బుక్స్ రాయించాలని తెలిపారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి వారి పిల్లల ప్రగతిని వారికి తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషాద్రి, జ్యోతి, ఉపాధ్యాయులు కేశవ రావు, సిఆర్‌పి శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

పాకాల, జూలై 4, ప్రభాతవార్త

పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రధానోపాధ్యాయులు డా. ఏ. మొహిద్దీన్ భాషా మాట్లాడుతూ బ్రిటిష్ ఎదురొడ్డి పోరాడిన మననయం వీరుడు అల్లూరు సీతారామరాజు తెలుగువాడు కావడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు. విశాఖ మన్యంలో జరిగిన రంపా తిరుగుబాటులో ప్రధాన పాత్ర అల్లూరి సీతారామరాజుదేనన్నారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర శాఖ చిట్టి కళావతి, అల్లూరి జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రమేష్ కుమార్, మాధవి, ఈశ్వరబాబు, రమణమ్మ, రవి, లక్ష్మీప్రసాద్, విష్ణుప్రియ, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, జూలై 4 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు గురు వారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు గుంటూరుకు చెందిన ప్రత్యూష, సాయిలు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

పాలసముద్రం, జూలై 4 ప్రభాతవార్త:



గత ఐదేళ్ళు వైకాపా పాలనలో నాయకులకు చెప్పి చూశాం. ఇప్పుడు మళ్ళీ తెలుగుదేశం నాయకులకు చెప్తున్నాం. అయినప్పటికీ మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ బీసీ కాలనీ సమీపంలోని అత్తిమంజేరిపేట వనదుర్గాపురం రహదారి తీరు మారని పరిస్థితి. గ్రామస్తులు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ కొద్ది రోజులకే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారని, అయితే అత్తిమంజేరిపేట రోడ్డు అధ్వాన్నంగా వుండటంతో ఇప్పటికిప్పుడు నాయకులు, గ్రామస్తులు సొంత నిధులు వెచ్చించి రోడ్డును బాగు చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు శ్రీనురాజు, నాయకులు గోపిరాజు, శేఖర్‌రాజు, వరదరాజు, సుబ్రమణ్యం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కిడ్నీ బాధితుడికి ఎమ్మెల్యే చేయూత

గూడూరు, జూలై 4, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని 14వ వార్డు, నలజాలమ్మ వీధి నందు కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆర్థికంగా చేయూత అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జి పరిమళ రాజేష్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని 14వ వార్డుకు చెందిన మంజులూరు సుబ్బారావు గత కొన్ని ఏళ్లగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్ పది వేల రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారన్నారు. ప్రభుత్వ పరంగా అందించే పథకాలను బాధితుడికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంఛార్జి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు, జులై 4, ప్రభాతవార్త




విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆదిశంకర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని ఆదిశంకర్ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం సహాయంతో ఏర్పాటు చేసిన ఆటల్ కమ్యూనిటి ఇన్నోవేషన్ ద్వారా టీకీ బోట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలల చైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ టీకి బోట్ సంస్థ వారు ల్యాబ్ కొరకు ఒక మిలియన్ రూపాయిలు ఖర్చు చేయడం సంతోషంగా ఉందన్నారు. కళాశాలలో విద్యార్థులకు అడిషనల్ లెర్నింగ్ ఫెసిలిటీ నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురుగదాస్, ఎన్. వెంకటరామిరెడ్డి, ఇమ్మానుయేల్, ధనుంజయ, ఏవో రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, జులై 4, ప్రభాతవార్త

గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు పేద ప్రజలందరూ దేవుళ్ళుగా భావిస్తున్న డాక్టర్ సిఆర్ రెడ్డి పేరు మీద డా. సిఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా పేద ప్రజలు డాక్టర్ దేవుళ్ళుగా పిలవబడే డా. జనార్దన్ రెడ్డి, డా. రోహిణి సంపూర్ణ సహాయ సహకారాలతో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచడం కోసం ఎయిడ్స్ వ్యాధి బాధితులు అయిన 30 మందికి ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా ఆర్ఎంఓ రవికుమార్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ హస్పిటల్ స్టాఫ్ సాయి కార్యవర్గ సభ్యులు వాచ్ షాప్ రాము ఎక్సైజ్ డిపార్ట్మెంట్ దయాకర్, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్ కెఆర్ఎం నక్క రామకృష్ణ, కోట వెంకటేశ్వర్లు,పోతిరెడ్డి పెంచలయ్య, నాగరాజు సంచి ముని ప్రసాద్, సివిఆర్ న్యూస్ సతీష్ పాల్గొన్నా రు.

## గూడూరులో బంద్ విజయవంతం

**గూడూరు, జులై 4, ప్రభాతవార్త** నీట్ పరీక్షలు జరిగిన అవినీతిపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు విద్యా సంఘాలు దేశవ్యాప్తంగా జూలై 4వ తేదిన బందుకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో గూడూరు పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశి కుమార్ మాట్లాడుతూ బందుకు సహకరించిన విద్యా సంస్థల యజమాన్యాలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న విద్యా విధానాల వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా నీట్ పరీక్షల నిర్వహణలో అవినీతి చోటు చేసుకోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాన కూడలిలో సిసి కెమెరాలు ఏర్పాటు

వాకాడు, జులై 4, ప్రభాతవార్త



వాకాడు మండల పరిధిలోని ప్రధాన కూడలి వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ తెలిపారు. గురువారం అశోక పిల్లర్ ఃసెంటర్ ఎస్ఐ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాకాడు మండల కేంద్రంలోని బీసీ కాలనీ, స్వర్ణముఖి నది సమీపాన కూడలిలో బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద, అశోక పిల్లర్ సెంటర్‌లో నాలుగు కెమెరాలు చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సిసి కెమెరాలు ద్వారా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వీక్షిస్తామన్నారు. ప్రధాన కూడలి సర్కిల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు తిరిగిన, మందుబాబులు మందు తాగుతున్నప్పుడు సిసి కెమెరాల ద్వారా చూడడం జరుగుతుందని అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. వాకాడులో నిఘ తప్పనిసరి అని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## విజయవాడ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

వాకాడు, జులై 4, ప్రభాతవార్త



వాకాడు డిపో నుండి విజయవాడకు కొత్తగా రెండు బస్సులను గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. డిపో మేనేజర్, సిబ్బందితో సునీల్ కుమార్ మాట్లాడారు. అనంతరం వాకాడు రెవెన్యూ అధికారులు, డిపో కార్మిక సిబ్బంది, సచివాలయం సిబ్బంది సునీల్‌ను కలిశారు.

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే...**

అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా గూ డూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని తెలిపారు. ఫారెస్ట్ అధికారులను ఆయన అభినందించారు.

## విజయోత్సవ ర్యాలీ విజయవంతం

వాకాడు, జులై 4, ప్రభాతవార్త



వాకాడు బ్యారేజ్ వద్ద నుండి గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ విజయోత్సవ ర్యాలీని మండల టిడిపి కమిటీ నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. గురువారం వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో క్రేన్ ద్వారా సునీల్ కుమార్ మెడలో పూలమాలను వేశారు. అశోక పిల్లర్ సెంటర్ నుండి సుమారు వెయ్యి బైకులుతో యూత్ ర్యాలీగా నిర్వహించారు. సునీల్ కుమార్ విజయోత్సవ ర్యాలీలో రోడ్డుకు ఇరువైపులా సుమారు ఒక కిలో మీటర్ వరకు భారీ స్థాయిలో నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు. పలుచోట్ల యువత డీజే కార్యక్రమాలుతో బాణా సంచాలతో మారుమోగాయి. పలువురు నాయకులు సునీల్ కుమార్‌కు శాలువా కప్పి బొక్కేలు అందజేశారు. సునీల్ కుమార్ ర్యాలీలో నానాజీ, దువ్వూరు మధుసూధన్ ంరెడ్డి, పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, చిన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి, చరణ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, హరీష్ నాయుడు, చరణ్ రెడ్డి, దువ్వూరు జనార్దన్ రెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, కిషోర్ కుమార్ నాయుడు, కృష్ణమూర్తి, బత్తిన ప్రమీల, నెల్లూరు సుధాకర్ రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, రామచంద్రయ్య, రౌతు శివకుమాత్, కుంచం దయాకర్, వల్లి ప్రసాద్, అరుణ్ కుమార్, వసంత్, కార్తీక్, తీపలపూడి రమణయ్య, కవిత, చిరంజీవమ్మ, సునీతమ్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు



**వెంకటగిరి, జులై 4, ప్రభాతవార్త** శ్రీకృష్ణ దేవరాయ కాపు బలిజ తెలగ, ట్రస్ట్ వెంకటగిరి వారి ఆధ్వర్యంలో శ్రీ వంగవీటి మోహనరంగా రావు 77 జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రాయల్ కాప్ జనరల్ సెక్రటరీ తోట కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి విశ్రాంతి ప్రిన్సిపాల్ బికే ప్రసాద్ అధ్యక్షత వహించగా జోతేశ్వర రావు, తిరుపాల్, తిరుపతి, ప్రసాద్, రాజా, ఆనంద, టోని బాబు, రంగా అభిమానులు, కాపుసోదరులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు రూ.30 కోట్ల రుణాలు ఇవ్వడమే లక్ష్యం

బాలాయపల్లి, జులై 4, ప్రభాతవార్త



రైతు ఉత్పత్తిదారుల వనస్పరసంగా ద్వారా 30 కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం లక్ష్యమని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. బాలాయపల్లి వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘ సమావేశం ఇంచార్జి ఏపిఎం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్కొక్క గ్రూపుకు 30 లక్షల రూపాయిలు నుంచి 50 లక్షల వరకు రుణాలు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించే విధంగా సిసిలు కృషి చేయాలని కోరారు. మండలంలో 100 గ్రూపులు ఉన్నాయని తెలిపారు. 30 కోట్ల రూపాయిలను ఈ ఆర్థిక సంవత్సరానికి రుణాలు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో సిసిలు ఆదిలక్ష్మి,సంగీత, రైతు మిత్రలు తిరుమల రావు, శిరీష, శైలజ, రాజగోపాల్, రమణయ్యలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపిన సిఎం చంద్రబాబు

పిడబ్ల్యూడి జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జడపల్లి మురళి గౌడ్

వెంకటగిరి, జూలై 4, ప్రభాతవార్త



దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్లను సీఎం చంద్రబాబు నాయుడు పెంచి వారి జీవితాల్లో వెలుగు నింపారని పిడబ్ల్యూడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జడపల్లి మురళి గౌడ్ తెలిపారు. వెంకటగిరిలో తెలుగు గంగ అతిథి గృహం వద్ద పిడబ్ల్యూడి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరి, పరసర ప్రాంత నియోజకవర్గ దివ్యాంగులు అందరు కలిసి ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పెంచినందుకు ఘనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. దివ్యాంగుల జీవితంలో నూతన వెలుగును ఈ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు రమేష్,మాధవ్, మోహన్, హరి మురళి, రాజా, కలవలపూడి శ్రీను, చలమయ్య, ఈశ్వరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పండ్లతోటలపై అవగాహన కల్పించాలి : ఎపిడి

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త



పండ్లతోటల పెంపకంపై రైతుల్లో అవగాహన కల్పించాలని డ్వామా ఎపిడి రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని దిగువపల్లి పంచాయతీ శికారిపాళెం కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు కనీస వేతనం రూ. 300లు చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొని చెరువులకు నీటిని సరఫరా చేసే కాలువ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 13రకాల పండ్ల తోటలు పెంచుకొనే అవకాశముందనీ, రైతులకు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇజిఎస్ ఎపిఓ శ్రీనివాస యాదవ్, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల పటిష్టతకు చర్యలు : నర్సోత్తమరెడ్డి

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త

మహిళా సంఘాల పటిష్టతకు చర్యలు తీసుకొంటున్నట్లు ఐకెపి ఎపిఎం నర్సోత్తమరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఐకెపి భవనంలో గ్రామసమాఖ్యల మహిళా సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో 32గ్రామ సమాఖ్యలున్నాయనీ, యేటా విఒల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికయిన వారితో మండల సమాఖ్య నూతన కమిటీ ఏర్పాటు చేసి తద్వారా సంఘాల పటిష్టతకు చర్యలు తీసుకొంటామన్నారు. విఒలు, బ్యాంకుల్లో తీసుకొన్న రుణలను సక్రమంగా చెల్లించి, వేరొకరికి సహకరించాలని ఆయన కోరారు. సిసి మునిరత్నం, గ్రామసమాఖ్య–4 మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు అత్యుత్తమ ప్రశంసలు

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరచిన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండాబాధ్యతలునిర్వహించినఎస్ఐప్రతాప్‌రెడ్డినిజిల్లాఎస్పిమణికంఠచందోళ్‌సత్కరించి,అవార్డునందించారు

## పుణ్యక్షేత్ర పవిత్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించండి!

మున్సిపల్ కమిషన్



శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక పవిత్రతను పరిరక్షించటానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు. గత నెల 5న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయంలో పరిచయ కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు భక్తి భావంతో స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలి తప్ప బస్సు,రైలు,కార్లు దిగినప్పటి నుంచి స్థానిక నాయకుల ముఖాలు చూడరాదని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో నాలుగు మాడావీధుల్లోనూ, సన్నిధివీధిలో రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలను నిషేధించాలని కోరారు.అంతేకాక తమ పార్టీ సంబందించిన ఫ్లెక్సీలను కూడా ఆలయ సమీపంలో కానీ ఆలయాలకు,ఆర్చిలకు కట్టరాదని నిబంధన పెట్టాలని కూడా అధికారులకు సూచించారు.ఈ మేరకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ నెల 1 నుంచి ఎంఎల్‌ఏ ప్రకటనను అమలు చేస్తున్నట్లు వివరించారు.

## వంగవీటి జయంతి వేడుకలు: అన్నదానాలు

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కాపుసామానిక వర్గానికి చెందిన నాయకులు పోటీలు పడి జయంతి వేడుకలను నిర్వహించారు. గురువారం రంగా సర్కిల్ వద్ద శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం, రాధారం గా మిత్రమండలి సారథ్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు అన్నదానాలు జరిపారు. వంగవీటిరంగా 77వ జన్మదిన వేడుకల సందర్భంగా రాధారంగా మిత్రమండలి అధ్యక్షులు సిద్దులుగారి ప్రసాద్ సారథ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్గిల్ సర్కిల్ వద్ద చిత్రపటానికి నివాళులర్పించి అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో మిత్ర మండలి ప్రసాద్‌తో పాటు సుబ్బారావు, వెంకటప్రసాద్, పగడాల సుధాకర్, ప్రతాప్,గోపి సుధాకర్, సతీష్‌కుమార్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. కాగా శ్రీకృష్ణ దేవరాయ జలజ సంక్షేమ సంఘం సారథ్యంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి వద్ద రంగా కూడలి వద్ద రంగా విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో మాజీ శ్రీకాళహస్తీశ్వరాలలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కాపు నాయకులు ఉప్పు కృష్ణయ్య, గాజుల సత్యనారాయన, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, అంజూరు వెంకటేష్‌బాబు,మాజీ కౌన్సిలర్లు కంతా ఉదయ్‌కుమార్ శరవణ కుమార్,మందల బాలాజి, బుల్లెట్ జయశ్యాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు గాజుల సత్యనారాయణ కేక్ కట్‌చేసి పేదలకు పంచిపెట్టారు.అన్నదానం చేసారు.

## శివయ్య ప్రసాదం ఎలా ఉందమ్మ?!

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త

మీరు ఎంతో దూరం నుంచి వచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రస్తుతం శివయ్య నిత్యప్రసాదంలో భోజనం చేస్తున్నారు? కదా ఆలయంలో దర్శనాలు ఎలా ఉన్నాయి? అర్చకుల స్పందన ఎలా ఉంది? ఎవరైనా మిమ్ములను దళారులు మభ్యపెట్టారా? ఎవరైనా కాసులు డిమాండ్ చేసారా? అని బొజ్జల బృందమ్మ గురువారం నిత్యాన్న ప్రసాదం హాలులో భక్తులను వాకబు చేసారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో చోటు చేసుకున్న అవినీతి బూజు దులపటానికి చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి నెల క్రితం ప్రకటించారు.ఈ నేపథ్యంలో ఆచరణకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో గురువారం బృందమ్మ, రిషితారెడ్డిలు ఆకస్మికంగా నిత్యాన్న సత్రంలో భోజనం చేస్తున్న భక్తుల వద్దకు వెళ్ళి భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.అంతేకాక వంటగదిలో వెళ్ళి సాంబారు, అన్నం, రసంను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, రావిళ్ళమునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్‌లో రైతులకు మెరుగైన సేవలు

తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త

కేంద్రప్రభుత్వం దేశంలో గల అన్ని ప్రాథమిక సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేసి వాటిని వాణిజ్య బ్యాంకుల వలె దేశంలోని అన్ని సంఘాలతో అనుసంధానం చేసి తద్వారా సభ్యులందరికీ మెరుగైన సేవలు ఆర్థికపర సేలు రుణాలు పంపిణీ మరియు వసూలు, డిపాజిట్లు సేకరణ చెల్లింపులువంటి రికార్డులు నిర్వహణలో పారదర్శకత మరియు జవాబుదారీతనంతో రైతుల యొక్క అవసరాలకు తగ్గట్టుగా విత్తనాలు, పురుగుమందులు మరియు రైతులకు కావాల్సిన ఆధునిక యంత్రాలు పనిముట్లు సరసమైన ధరలో అద్దె ప్రాతిపదికన అందజేసేందుకు ఇతర సేవలు అందుబాటులో తెచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కంప్యూటరీకరణ ప్రక్రియను ప్రారంభించి పూర్తిచేసేందుకు ప్రాథమిక సహకార సంఘాల సభ్యులకు సిఈఓ చిరంజీవిరెడ్డి తెలిపారు. ప్రాథమిక సహకార సంఘ సభ్యులు సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతి సభ్యుడు వెంటనే ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు, పోన్‌నంబర్‌ను తీసుకుని సంఘ సిబ్బందికి అందించి కెవైసి చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా భవిష్యత్తులో ఇచ్చే వివిధ రాయితీలు పొందవచ్చన్నారు. ప్రాథమిక సహకార సంఘంలో ఇప్పటి వరకు ఉన్న సభ్యత్వం పునరుద్ధరణ జరుగుతుందని లేకపోతే సభ్యత్వ హక్కును కోల్పోతారని తద్వారా సహకార సంఘాలకు జరిగే ఎన్నికల్లో ఓటుహక్కును కోల్పోతారని సిఈఓ తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసే ఎరువుల పంపిణీ, విత్తనాల పంపిణీపై సబ్సిడీ కూడా రాదని తెలిపారు. అలాగే రైతు భరోసా పథకాలు, రైతుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్ కాఫీలు అందించి రైతులు సభ్యత్వాన్ని పునరుద్దరించుకోవాలన్నారు.

## జివో నంబర్ 117 రద్దు చేయాలి

-ఎస్‌టియు డిమాండ్

తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త

జివో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని ఎస్‌టియు డిమాండ్ చేశారు. ఎస్టీయూ తొట్టంబేడు మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దకనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దవిద్యాభివృద్ధికి పెను విఘాతంగా మారిన జివో నంబర్ 117ను వెంటనే రద్దు చేసే ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు తరపున తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె.రమేష్, అసోసియేట్ అధ్యక్షులు గుమ్మళ్ళ మురళీ, అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణయ్య, , డివిజన్ కన్వీనర్ పూడి సుధాకర్‌యాదవ్, తొట్టంబేడు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్ చంద్రశేఖర్, జిల్లా నాయకులు గజేంద్ర, మోతీలాల్, చంద్రయ్య, బత్తెయ్యతదితరులు పాల్గొన్నారు.

## సిఎం, డిసిఎం ఫోటోలు ఆవిష్కరించిన నాయకులు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో గురువారం ఉదయం శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి నివాసంలో ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డెప్యూటి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను ఆవిష్కరిం చారు.వారి ఫోటోలతో పాటు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఫోటోను కూడా ఏర్పాటు చేసారు.ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నారాచంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌ల ఫోటోలను ఆవిష్కరించాలని ఆదేశించారు.ఈ మేరకు ఏ పసైజ్ ఫోటోలను ఏర్పాటు చేయాలనే అంశంపై దిశ దేశ నిర్దేశం చేసారు.ఈమేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫోటోల ఏర్పాటుకు సంబంధించి దేశం నాయకులు నిర్ణయించారు.ఈ మేరకు గురువారం పార్టీలో సీనియర్లు మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు కాసరం రమేష్,ఢిల్లిబాబుల సారథ్యంలో ఫోటోల ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. కార్యక్రమాల్లో వాకచర్ల గుర్ర ప్పుసెట్టి,డివి నారాయణ,ఢిల్లిబాబు,షేక్‌జిలానిబాషా,కటికం సుబ్రమణ్యం పురుషోత్తం నాయుడు, వివేక్, రాకేష్, నవీన్,మల్లి ఆచారి, శ్రీనివాసులు,కాసరం సీను, రాజు తదితరులు పాల్గొన్నారు.కాగా వారు పట్ట ణంలోని తహశీల్దార్ కార్యాలయం,డిఎస్‌పి కార్యాలయం, ఆర్‌డిఓ కార్యాలయం, పోలీసు స్టేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు ఫోటోలను అందజేసారు.

## మాజీ ఎమ్మెల్యే స్వార్థానికి ప్రజాధనం వృథా

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జులై 4, ప్రభాతవార్త

మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు టిడిఆర్ బాండ్ల రూపేణ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యతపై థర్డ్ పార్టీ పరిశీలన తరువాతే డబ్బు చెల్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కులశేఖర్ ఆళ్వార్ మార్గాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. కులశేఖర్ అళ్వార్ మార్గం కుంగిపోవడంతో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం అవసరానికి మించి రోడ్డును తొవ్వేసిన తీరును ఆయన చూశారు. ఏడు కోట్ల రూపాయలతో ఈ రోడ్డును నిర్మించినట్లు ఎస్‌ఈ మోహన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పిడిసిఎల్ ఈఈ దామోదర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం రోడ్డును త్రవ్వోడంతో కుంగిందని చెప్పారు. ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరగా మరమ్మత్తులు పూర్తి చేస్తామని తెలిపారు. ఐదు వరుసల కేబుల్ కోసం అండర్ గ్రౌండ్‌లో డ్రిల్ చేయడం వల్ల రోడ్డు దెబ్బతిందని ఎస్‌ఈ మోహన్ చెప్పారు. పది అడుగులు మేర తొవ్వాల్సిన రోడ్డు ముప్పయ్ అడుగుల మేర దెబ్బతిందని ఆయన వివరించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలోనే కాదు టిడిఆర్ బాండ్ల పేరుతో ప్రజాధనాన్ని మాజీ ఎమ్మెల్యే దోచుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. జనసంచారం పెద్దగా లేని ప్రాంతంలో రోడ్డు వేసి నాణ్యతను పట్టించుకోకపోవడంతో కుంగిపోవడంతో పాటు గోతులుకు తావుతీస్తోందని ఆయన తెలిపారు. సిక్స్ లేయర్స్‌తో నిర్మించిన రోడ్డులో నాణ్యత పట్టించుకోకపోవడానికి కేవలం మాజీ ఎమ్మెల్యే స్వార్థమే కారణమని ఆయన విమర్శించారు. థర్డ్ పార్టీతో నాణ్యత ప్రమాదాలు పరిశీలించాకే డబ్బు చెల్లించాలని ఆయన అధికారులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, టిడిపి కార్పొరేషన్ ఆర్సీ మునికృష్ణ, చినబాబు, బిజి కృష్ణ యాదవ్, బాబ్జీ, చెల్లా సెల్వం, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, బండ్ల లక్ష్మీపతి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## రెండవ విడత ఐటీఐకి దరఖాస్తులు ఆహ్వానం

విజయపురం, జూలై 4 ప్రభాతవార్త:

మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐకి రెండవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలిత పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను డబ్లుడబ్లుడబ్ల్యు డాట్ ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీవో వీడాట్ ఇన్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ధృవపత్రాలను జత చేసి జూలై 24న సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో సమర్పించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఎటువంటి ఇంటర్వ్యూ కార్డులు పంపరని, పూర్తి వివరాలకు సెల్ నెం.8639790174ను సంప్రదించాలని కోరారు.

## దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



**విజయపురం, జూలై 4 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరులో దివ్యాంగుడు సాయికి పాతార్కాడుకు చెందిన టీడీపీ నాయకుడు ముని భాస్కర్‌రాజు వితరణగా వీల్‌చైర్‌ను గురువారం పంపిణీ చేశారు. దివ్యాంగుడి సౌకర్యార్థం తనవంతు సాయం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరదరాజులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లూరికి ఘన నివాళి

ఏర్పేడు, జూలై4,ప్రభాతవార్త;



తెలుగుతల్లి ముద్దు బిడ్డ అల్లూరి సీతారామరాజు ఆంగ్లేయుల తూటాలకు బలియై ఆంధ్రులందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచాడని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నంద్యాల వెంకటసుబ్బమ్మ కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి మెడలో పూలహారం వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశాఖ జిల్లా మన్యం ప్రాంతంలో స్వాతంత్ర పోరాటం జరిపాడని తెలిపారు. అధ్యాపకులు నాదేండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలిచిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం తెలుగుజాతికి గర్వకారణం అన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం ఉమా, జలగం రామాంజులు, వెంకట సురేష్, రాఘవరెడ్డి, అమరేశ్వరరెడ్డి, శంకరప్ప, సమీర్, సోమశేఖర్‌బాబు, నారాయణబాబు, వైవి రాధ, సాయి తేజ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో ఎరువుల ఖర్చు ఆదా

ఏర్పేడు,జూలై4, ప్రభాతావార్త;



భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడితే ఎరువులపై ఖర్చు బాగా తగ్గించవచ్చునని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎండీ పుత్తూరులో ఆత్మ సహకారంతో భూసార పరీక్షలపై గురువారం ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షల ద్వారా నేల ఆరోగ్యం, పోషకాల అందుబాటు, లోపాల గురించి రైతులకు తెలుస్తుందని తెలిపారు. ఈ ఫలితాలను బట్టి నేల ఆరోగ్యం బాగుకు లోపాలు సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటే పంటలలో అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. వరి సాగులో నానో ఎరువుల వాడకం సూక్ష్మ పోషకాల గురించి ఇఫ్కో క్షేత్ర అధికారి మణిచంద్ర తెలిపారు. మండల వ్యవసాయ అధికారి షణ్ముగం మండలంలో వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించి వాటిని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ సర్పంచి మోహనప్రియ, వ్యవసాయ సహాయకురాలు భారతి పాల్గొన్నారు.

## నీట్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలి..!

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా జాయింట్ సెక్రటరీ తేజ డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్షల లీకేజీకి కారకులైన ఎన్.టిఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు టవర్‌క్లాక్ వద్ద మానవహారం నిర్మించారు. ఇందులో భాగంగా చంద్రగిరిలో విద్యా సంస్థల బంద్ పాటించారు. పరీక్ష వ్రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా పాఠశాలల మూసివేతను వెంటనే ఆపాలని కోరారు. యూనివర్శిటీ కేంద్రాలలో విద్యార్థులపై అక్రమ కేసులను బనాయించడం ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా నాయకులు శ్రీనివాస్, సుబాన్, హర్షద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటి సమస్యపై అట్టుడికి గ్రామసభ...

అధికారులను నిలదీసిన ప్రజలు

రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:



రేణిగుంట మేజర్ పంచాయతీలో గురువారం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన, ఇన్‌చార్జి కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షణలో జరిగిన గ్రామసభ నీటి సమస్యపై అట్టుడికింది. గ్రామ సభకు వార్డు మెంబర్లు మహబూబా బాషా, ఎంజీ రెడ్డి, వి.వెంకటరమణ, మినహా అందరూ వార్డు మెంబర్లు దుమ్మా కొట్టారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన వార్డు మెంబర్లు గైర్హాజరు కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట పంచాయతీలోని అనేక ప్రాంతాల్లో ఏర్పడిన నీటి ఎద్దడి పై ప్రజలు పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లో 15 రోజులుగా నీళ్లు రావడం లేదంటూ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి సమస్య పరిష్కరించకపోగా ఏవేవో కుంటి సాకులు చెబుతున్నారని నిలదీశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన వార్డు మెంబర్ల తీరుపై చర్చించుకోవడం గమనార్హం. నీటి సమస్యపై సర్పంచ్ నాగేశం స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అప్పటి వరకు నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటినిసరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, సీపీఎం నేతలు ఓ.వి.రమణ, హరినాథ్, సెల్వరాజ్, ఎంపీటీసీ రాజేశ్వరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.ఆర్.రావణన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పులివర్తిని కలిసిన డైరెక్టర్ అనిల్ రావిపూడి

తిరుపతిరూరల్, జూలై 4 ప్రభాతవార్త:



చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని గురువారం సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు, నానికి పుష్పగుచ్చం అందజేసి. దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాలుగా అన్ని వర్గాల ప్రజలతో పాటు సినీ పరిశ్రమ కూడా ఇబ్బందిపడిన విషయాన్ని గుర్తు చేసారు. అనిల్ రావిపూడి మంచి రచయిత, దర్శకుడని, ప్రేక్షకులకు సందేశాత్మక చిత్రాలను అందించారని ఎమ్మెల్యే నాని తెలిపారు.

## నరసింహస్వామి సన్నిధిలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త



పట్టణంలోని భరద్వాజతీర్థంలోని నరసింహస్వామి సన్నిధిలో గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో శివగణం భక్తబృందం ఆధ్వర్యంలో అవధూత సాయి అన్నపూర్ణ మాత ఆరాధన ఉత్సవం సందర్భంగా నరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు మరియు పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి క్షేత్ర స్థల పురాణం గురించి డాక్టర్ నగరి చాముండేశ్వరరావుచే ప్రవచనం జరిగింది సుమారు 200మంది భక్తులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శివగణ బృందం సిద్దులయ్య మరియు రామలింగస్వామి తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచార సభ్యులు రాజ్‌కుమార్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

## విప్లవీరుడు అల్లూరి త్యాగం ఆదర్శం



మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని టిటిడి ఉద్యోగులు జరుపుకున్నారు, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రభాతవార్త-తిరుపతి

# తిరుపతి డివిజన్

## మనందరం ప్రజా సేవకులం...ప్రజల కోసం కలిసి పని చేద్దాం

-ప్రజా ప్రభుత్వమనే విషయాన్ని గుర్తించుకొండి

-చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్త అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, జూలై 04 ప్రభాతవార్త:



మనందరం ప్రజా సేవకులం...ప్రజల కోసం, ప్రజల సంక్షేమ కోసం కలిసి పని చేద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు సూచించారు. గురువారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో చంద్రగిరి నియోజకవర్గం అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. మొదటిగా అధికారులందరితో పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే, అభివృద్ధిలో మీ సహకారం అవసరమని తెలిపారు. అంతకమునుపు సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి తిరుపతిరూరల్ ఎంపిడిఓ రమేష్‌బాబు, ఏవో పిచ్చిరెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. గత ప్రభుత్వంలో వ్యవహరించిన తీరును ఈ ప్రభుత్వంలో ప్రదర్శించరాదని, ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. వివిధ రకాల పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే పౌరులకు మర్యాద ఇవ్వాలని, వారు చెప్పే సమస్యలను సావధానంగా విని, పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అశ్రద్ధ వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా తమ దృష్టికి తీసుకువస్తే, వారి సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పనులలో పెద్ద సంఖ్యలో భారీ అవినీతి జరిగినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పులివర్తి నాని హెచ్చరించారు. నిత్యం అధికారులు ప్రజల్లో ఉంటూ అభివృద్ధి పనులలో భాగస్వామ్యమై ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా మండల స్థాయి అధికారులు తెలిపారు.

## తుమ్మలగుంట సమావేశ మందిరంలో దొంగలు పడ్డారు

- 200 కిలోల ఇనుప గ్రిల్స్ మాయం చేసిన ఘనులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై 04 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట సమావేశ మందిరంలో ఇనుప గ్రిల్స్ చోరి జరిగింది. సమావేశ మందిరం పక్కనే నూతనంగా నిర్మిస్తున్న హై స్కూల్ అదనపు గదులకు గ్రిల్స్‌ను సమావేశ మందిరములో తయారు చేస్తున్నారు. ఈనెల 2వ తేది రాత్రి దాదాపు 200 కిలోల ఇనుప గ్రిల్స్‌ను చోరీకి గురైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రిల్స్ తయారీదారులు తెలిపారు. ఇనుప గ్రిల్స్ చోరీకి గురై 3రోజులు కావస్తున్న ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఉపాధ్యాయులను టిడిపి ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇనుప కడ్డీల విలువ దాదాపు రూ.16వేల రుపాయాలు ఉంటుందని గ్రిల్స్ తయారీదారులు తెలిపారు. దొడ్ల కరుణాకర్‌రెడ్డి వెంటనే ముత్యాలరెడ్డిపల్లి పోలీసులకు ఫోన్ చేసి, గ్రిల్స్ మాయంపై ఫిర్యాదు చేసారు. విద్యార్థులకు ఎలాంటి భద్రతలేని చోట అదనపు గదులు నిర్మిస్తున్నారని...ఎలాంటి భద్రత ప్రమాణాలు...నియమనిబంధనలు పాటించకుండా చెరువులో అదనపు గదులు నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి, నూతన అదనపు గదుల నిర్మాణాలపై పునర్ ఆలోచించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గోఫి, రాధరాయల్, కె,భాస్కర్‌రెడ్డి, చంగల్ రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చెర్లోపల్లిలో ఘనంగా రంగా జయంతి వేడుకలు

తిరుపతిరూరల్, జూలై 04 ప్రభాతవార్త:



కాపుల ఆరాధ్య నేత, పేదల పాలిట పెన్నిధి వంగవీటి రంగా 77వ జయంతి వేడుకలను గురువారం చెర్లోపల్లి ఉప సర్పంచ్ కూరగాయల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంగా చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళ్ళు అర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉప సర్పంచ్ చంద్ర మాట్లాడుతూ వంగవీటి రంగా పేదలకు అండగా నిలిచి, నిస్వార్థంగా సేవలు అందించిన ప్రజా నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరగాయాల ప్రసాద్, మాజీ ఎంపిటిసి రుద్రయ్య, ఆర్కాట్ కృష్ణప్రసాద్,రామకృష్ణ, శంకర్ దాదా, స్వామి, నరేష్, రాజశేఖర్, శివ, రవి, వెంకటపతి, ఋషి తదితరులు పాల్గొన్నారు.

## ఉచితవైద్యశిబిరానికి విశేష స్పందన

నింద్ర,జూలై 4 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లబించింది.ఉచిత వైద్యశిబిరం పుత్తూరు అన్నగౌరి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆశీస్సులతో నింద్ర మండలం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది. ఉచిత వైద్య శిభిరంలో ఎముకలు,ముక్కు,గొంతు,చెవి,శాస్త్ర చికిత్స,స్త్రీల వ్యాధులుతో పాటు చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలు కంటి చికిత్స,దంత సమస్యలు పిజియోథెరపి,చర్మ సంబంధమైన వ్యాదులకు సంబంధించి పరీక్షించారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వరరావు,కార్యదర్శి విజయకుమార్,నాయకులు పరదేశి,సంపూర్ణమ్మ,కోటీశ్వరరావు,దేవనేషన్, దేవ,ప్రసన్నకుమార్, ఏబిరాజు, సత్యరాజ్,శరవణ,భాస్కర్,పేరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## అంకురార్పణతో ప్రారంభమైన పరాశారేశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, జూలై 4 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనంలో టిటిడి అనుబంధ ఆలయంగా ప్రసిద్ది చెందిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం గణపతిపూజ, అంకురార్పరణతో ప్రారంభమైనది. అంతకుముందు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై అలంకరించి ఆలయంలోనే ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. సాయంత్రం గణపతిపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం అంకురార్పణ నిర్వహించారు.

***నేడు ధ్వజారోహణం :*** నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షులు నాగరాజు తెలిపారు.

## ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్

కేవీబీ పురం, జూలై 4 ప్రభాతవార్త:

మండలంలో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రైతు సమాజాన్ని అందిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని లేకుంటే అనర్థాలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులచే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిస్తామని గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్లాస్టిక్ వాడకం నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రజాప్రగతి ట్రస్టు కో-ఆర్డినేటర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌లుమాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రామాల్లో వారికి అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజాప్రగతి ట్రస్టు సిబ్బంది గంగయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలసిన పంచాయతీరాజ్ నాయకులు

తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త



రాష్ట్ర పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ తరపున జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరన్‌ను యూనియన్ తరపున మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శివయ్య తీర్థ ప్రసాదాలను అందించారు. కలెక్టర్‌ను కలసిన వారిలో బి.ప్రభురెడ్డి, రాష్ట్ర ట్రెజరర్ రాష్ట్ర వైస్ చైర్మన్ పెయ్యలవెంకటేశ్వర్లు, రాయలసీయజోన్ జనరల్ కార్యదర్శి కె.ఆనందబాబు తదితరులు ఉన్నారు.

## తిరుపతిలో అల్లూరి విగ్రహం ప్రతిష్టించాలి

### కమిషనర్ అధితి సింగ్‌కు విజ్ఞప్తి

తిరుపతి కార్పొరేషన్, జులై 4, ప్రభాతవార్త

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని తిరుపతి నగరంలో ప్రతిష్టించాలని కోరుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, నరసింహాచారి, కార్పొరేటర్లు ఆర్‌సి మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, అనిల్ కుమార్, వరికుంట్ల నారాయణ కమిషనర్ అధితి సింగ్‌కి విజ్ఞాపక పత్రం అందించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం తరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ని కలిసి మాట్లాడుతూ తిరుపతి నగరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఇంత వరకు ప్రతిష్టించకపోవడం విచారకరమన్నారు.

# సమాజస్థాపనలో అల్లూరి బాట మనకు ఆదర్శం

**- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం,జూలై 4 ప్రభాతవార్త

సమాజ స్థాపనలో విప్లవజ్యోతి, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు చూపిన బాట మనకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం మండల కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య మహాసంగ్రామంలో అల్లూరి మహోజ్వలిత శక్తిగా వెలుగొందారన్నారు. పీడిత గిరిజనులను స్వాతంత్ర్య సంగ్రామానికి సమాయత్తం చేసిన మహనీయుడు అని కొనియాడారు. 1897జూలై 4న విజయనగరం సమీపంలోని పాండ్రంగిలో జన్మించిన అల్లూరి ఆరో తరగతి చదివే రోజుల్లోనే తన త ండ్రిని కోల్పోవడంతో ఆయన జీవితంలో పెనుమార్పులు వచ్చాయన్నారు. కొండలు, అడవుల్లో తిరుగుతూ గిరిజనుల జీవితాలను గమనించేవారని అదే సమయంలో జ్యోతిష్యం, వాస్తు, హఠయోగం, కవిత్వం నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు తెల్లదొరల చేతుల్లో అనేక దురాగతాలు, దోపిడీలకు అన్యాయాలకు గురయ్యేవారని పేర్కొన్నారు. మన్యంలో గిరిజనుల జీవితాలు దుర్భర ంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలు తొలగించాలని భావించిన అల్లూరి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. 27 ఏళ్లప అమరుడయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డ్వామా పిడి రాజశేఖర్, డిఆర్‌డిఎ పిడి తులసి పాల్గొన్నారు.

# పొగాకు విక్రయాలపై కఠిన చర్యలు

**ఎస్పీ మణికంఠ చందోలు**

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

బహిరంగ ధూమపానం, పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఈ మేరకు పోలీసులు గురువారం బహిరంగ ప్రదేశాల్లో దూమపానం చేసే వారిపై, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం సిగరెట్టు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం(సిఓటిపిఎ)ని ప్రభావవంతంగా అమలు చేయడానికై, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్ఇసిపి), రాష్ట్ర ప్రజా ఆరోగ్యశాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో పోలీసులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా



కార్యక్రమంలో పొగాకుకు వ్యతిరేకంగా పోరాడటంలో వారి నిబద్ధతకు నిదర్శనంగా పోలీసు అధికారులందరు పొగాకుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధులతో మన రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 48 వేల మరణాల సంభవిస్తున్నాయన్నారు. సిఓటిపిఓపై నిర్వహించిన శిక్షణ తరగతులతో పోలీసులకు చట్టంను సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయ పడుతుందన్నారు. కోప్టా చట్టంలోని సెక్షన్6(ఎ) ప్రకారం విద్యా సంస్థలకు 100 యార్డుల పరిధిలో పొగాకు విక్రయించడం నిషేధమన్నారు. పెద్ద వయస్సు గల వారు పొగాకు వ్యసనపు విషపు కోరల్లో చిక్కుకున్నప్పటికీ పిల్లలను పొగాకు వ్యసనపరులు కాకుండా రక్షించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎఎస్పీ ఎస్.ఆరీఫుల్లా, డిటిసీ డిఎస్పీ శ్రావణ్‌కుమార్, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లాలోని డిఎస్పీలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# డీపీఓచే పారిశుద్య పనుల తనిఖీ

తవణంపల్లె, జూలై 4 ప్రభాతవార్త:

అంటువ్యాధుల నివారణలో భాగంగా మండలంలోని జరుగుతున్న పారిశుద్య పనులను జిల్లా పంచాయతీ అధికారి టి.లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండ, పుణ్య సముద్రం, మారేడుపల్లె గ్రామ పంచాయ తీల్లో జరుగుతున్న పారిశుద్య పనులను స్థానిక అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఇళ్ళ వద్ద త్రాగునీటి పైపుల లీకేజిలు లేకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచాలని, చెత్తాచెదారం తొలగించాలని ఆయా గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల ఈఓపీఆర్డీ కుమార్, అరగొండ పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు భరణి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

# వరసిద్దుని దర్శించుకున్న ప్రముఖ సినీ దర్శకుడు రావిపూడి

కాణిపాకం, జూలై 4 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం ఆయనకు వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# గోవింద దామానికి నిధులు కేటాయించండి

**టిటిడి చైర్మెన్ శ్యామలరావును కోరిన ఎమ్మెల్యే పులివర్తి నాని**

తిరుపతిరూరల్, జూలై 04 ప్రభాతవార్త:



చంద్రగిరి నియోజకవర్గంలో భక్తులకు విశ్రాంతి షెడ్డులు నిర్మించుటకు, ఆలయాల అభివృద్ధికి, గోవింధ దామం ఏర్పాటుకు టిటిడి నుండి నిధులు కేటాయించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని టిటిడి చైర్మెన్ శ్యామలరావును కోరారు. గురువారం టిటిడి చైర్మెన్ శ్యామలరావును ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. చంద్రగిరిలో సరైన స్మశాన వాటిక లేదని, గోవింధ ధామం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ప్రపంచ నలుమూలలు నుండి తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తులు శ్రీవారి మెట్టుదారిన తలదాచుకోవటానికి విశ్రాంతి షెడ్డులు లేవని విశ్రాంతి షెడ్డు నిర్మాణాలకు టిటిడి సహకరించాలని కోరారు. టిటిడి తీసుకునే నిర్ణయాలకు తమ సహయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని నాని తెలిపారు.

# నీట్ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడాలి

**న ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయకుమార్ డిమాండ్**



నగరి, జూలై 4 ప్రభాతవార్త:

నీట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయకుమార్ డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నగరి పట్టణంలో విద్యా సంస్థలు బంద్‌ను పాటించాయి. ఇందులో భాగంగా విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి మానవహారం, ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్(యూజీ), నీట్(పీజీ) యూజీసీ నెట్ పేపర్ లీకేజీల బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు నీట్ పరీక్ష లీకేజీలో తెర వెనుక జరిగిన స్కామ్‌పై సమగ్ర విచారణ దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామంటూ హెచ్చరించారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, బాషా, సత్తార్, శేఖర్, సిరావుద్దీన్, సంఘీభావం తెలుపగా ఏఐఎస్ఎఫ్‌గా నాయకులు రాబిన్, రోహిత్, విశాల్, ముని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వంగవీటి మోహన రంగా జయంతి

**త్వరగా వంగవీటి విగ్రహ ఏర్పాటు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి హెల్త్, జులై 4, ప్రభాతవార్త

తిరుపతి అనంత వీధి కూడలిలో రాధారంగా మిత్రమండలి, బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు విచ్చేసారు. ముందుగా వంగవీటి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగ అని, నిస్వార్ధ ప్రజా సేవకుడని తెలియజేసారు. తరువాత రాధారంగా మిత్రమండలి అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన చేతుల ద్వారా వంగనీటి మోహనరంగా జయంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బెల్లం కొండ సురేష్, నీలాద్రి, ఆముదాల తులసీరామ్, షేక్ మౌలా, వెంకటకృష్ణ, సుబ్బా అంజిబాబు, ఆర్కాట్ సాయి, తోట జయంతి, కోకిల, ఆళ్వార్ మురళి, కూరగాయల ప్రసాద్, గోపి రాయల్, అవిశెట్టి ప్రభాకర్, శెట్టిపల్లి,చరణ్, వంశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు ధర్నా

తిరుపతి విద్య, జులై 4, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిమిసెస్ 2 హాస్టల్స్ వసతి గృహంలో విద్యార్థినీలు బుధవారం సాయంత్రం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ హాస్టల్‌లో పలు రకాల సమస్యలతో దాదాపుగా రెండు సంవత్సరాలుగా ఇబ్బందికరమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. హాస్టల్‌లో కనీస వసతులు కూడా సరిగా లేవని శానిటేషన్, క్లీనింగ్ అసలు సరిగా పట్టించుకోవడం లేదని, హాస్టల్ వార్డెన్స్ కనీసం వారానికి ఒకసారి కాదు కదా మూడు నెలలుకు ఒకసారి కూడా హాస్టల్‌లో పర్యవేక్షించడానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ పనిచేస్తున్న సిబ్బంది వసతులు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా గమనించకపోవడం విద్దూరంగా ఉందన్నారు. వెంటనే హాస్టల్ సమస్యల పరిష్కరించేంత వరకు ధర్నా నిర్వహించుకోవాలని సాయంత్రం 8 గంటల నుంచి రాత్రి 11.45 వరకు కూడా ధర్నా నిర్వహిస్తూనే ఉన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వర్షం పడుతున్న మహిళ విద్యార్థినిలు ధర్నా నిర్వహిస్తున్నారు. వీరికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌పిడి ఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, ఏబీవీపీ, అఖిల విద్యార్థి సంఘాల నాయకులు తమ మద్దతును తెలిపారు. ఎస్వియు ఇన్చార్జి రిజిస్ట్రర్ బి. చంద్రయ్య విద్యార్థుల సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

# వివేకానంద జీవితం ప్రపంచానికి స్ఫూర్తిదాయకం

**-రాయలసీమ రంగస్థలి**

తిరుపతి,జులై 4ప్రభాతవార్త:



సంఘసంస్కర్త, సామాజిక వేత్త స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు, ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని రాయల సీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కొనియాడారు. భారతదేశాన్ని జాగృతం చేయడమేగాక అమెరికా, ఇంగ్లండులలో యోగ, వేదాంత శాస్త్రాలను తన ఉపన్యాసాల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన మహానుభావుడన్నారు. గురువు కోరిక మేరకు అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మతప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేసి దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారన్నారు. ఆయన పుట్టినరోజును యువజన దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయమాన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా నగరంలోని ఎస్వీవైద్యకళాశాల కూడలిలలో ఆయన విగ్రహానికి పూజలు చేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపినాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, రవిప్రసాద్, శాంబోలు హరినాథ్, మురళి, చంద్రబాబునాయుడు ,దీపక్‌యాదవ్ తదితరలు పాల్గోన్నారు.

# అల్లూరి సీతారామరాజు సంస్కరణ సభ

తిరుపతి విద్య, జులై 4, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ బ్లాక్‌లో ఉదయం స్వాతంత్ర సమరయోధులు శ్రీ కీర్తిశేషులు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మహిళా వర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజని పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన యొక్క గొప్ప గుణగణాలను కొనియాడారు. ఈ సంవత్సరం నుండి గవర్నమెంట్ అల్లూరు సీతారామరాజు జయంతిని జరువుకునే లాగా చేపట్టిన పద్దతిని అభినందించారు. ఆయనను స్మరించుకోవడం ద్వారా ఆ గుణగణాలను మనం కూడా అలవర్చుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ డాక్టర్ బి గీతావాణి, ఎక్స్యూక్యుటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు ఇతర విభాగాల డీన్లు, విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# ఢిల్లీలో అల్లూరి జయంతి వేడుకలు

**- సిఎంతో కలిసి అల్లూరికి నివాళులు అర్పించిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసదరావు**



చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

దేశ రాజధాని ఢిల్లోలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సిఎం నారా చంద్రబాబునాయుడుతో కలిసి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసదరావు మాట్లాడుతూ ఆధునిక సమాజానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. అల్లూరి నడిచిన బాటలో నడిచి సమాజ సేవకు అంకితం అవుతానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ఇతరులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

# ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాని న్న గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా స్టేడియంలో ఉన్న వసతులను పరిశీలించి క్రీడాకారులు ఆడేందుకు వీలుగా మైదానాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టేడియం అభివృద్ధికి తీసుకోవాల్సి న చర్యల గురించి ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మణిక ంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ హరికుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# కొత్త కలెక్టర్‌కు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా కలెక్టర్‌గా ఎస్ వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని ప్రసాదాలను గురువారం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు అందించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందించారు. దుశ్శాలువతో సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలుఅ ందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్సెపెక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐ బాలచంద్ర తదితరులున్నారు.

# అప్పులవారి వేధింపులతోనే నర్సింహులు ఆత్మహత్య

పుంగనూరు, జూలై 4 ప్రభాతవార్త:

పట్టణంలోని కొత్తపేట వద్ద జ్యోతి మెడికల్స్ నిర్వహిస్తున్న నర్సింహులు అనే వ్యక్తి అప్పులవారి వేధింపులు తీవ్రం కావడంతో వాయల్పాడు సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తఇండ్లు క్రాస్ వద్ద కొంతకాలముగా నర్సింహులు జ్యోతిమెడికల్స్ నిర్వహిసు_న్నాడు. దుకాణానికి అవసరం కావడంతో స్థానిక వడ్డీవ్యాపారస్తుల వద్ద కొంత మొత్తా_న్ని వడ్డీలకు తీసుకున్నాడు. ఈనేపథ్యంలో వడ్డీలు ఇచ్చిన వారి వేధింపులు మితిమీరిపోవడంతో పాటూ,దారుణంగా దూషించడం మొదలు పెట్టారు. అయితే, ఈవిషయాలను ఆయన తన బంధువులకు ఎవరికీ చెప్పక తీవ్రంగా కుమిలిపోయాడు. ఆయన బంధువులు స్థానికంగా వార్తదినపత్రిక సరు్య ్లలేషన్‌ను కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. వడ్డీవ్యాపారుల వేధింపులు తీవ్రం కావడంతో ఆయన తన స్వగ్రామానికి వెళ్ళివస్తానని బుధవారం తన భార్యకు చెప్పి వెళ్ళి వాయల్పాడు సమీపంలో దిక్కుతోచక తీవ్రమనస్తాపానికి గురైన చెట్టుకు ఉరివేసుకున్నాడని ఆయన భార్య,బంధువులు వివరించారు. నర్సింహులు కుటుంబానికి న్యాయంచేయాలని, వడ్డీవ్యాపారులను గుర్తించి కేసులు నమోదుచేయాలని వారు పోలీసులను కోరుతున్నారు. తమకు న్యాయం చేయాలని వారు దేశం నాయకుడు చల్లాబాబుకు విజ్ఞప్తి చేశారు.

# జిల్లా కలెక్టర్, ఎస్పీని సత్కరించిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూలై 4 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ వర్షవర్ధన్‌రాజులను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ని కోరారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడడం కోసం ఎస్పీ సహరించాలన్నారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు కొండూరు బాలరాజు తదితరులు వున్నారు.

# గురువుకు షోడషాభిషేకాలు:షిరిడి సాయికి ప్రత్యేకాలంకారాలు

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త

చదువుల గురువు గురుదక్షిణామూర్తికి గురువారం షోడషాభిషేకాలు నిత్యపూజలు,పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయాల్లో స్వామికి ప్రతేకాలంకారాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో దక్షిణామూర్తికి పూజలు,అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల సంఖ్య పరిమితంగా ఉంది. దాంతో వచ్చిన వారు సుదర్శనం, సత్వర దర్శనం చేసుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా భక్తులు అంతంతమాత్రంగానే ఉన్నారు.

**ప్రతి దేవునికి అలంకారాలు,అభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన పరివారదేవతలకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి పూజలు, విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న భోళాశంకరుని సన్నిధికి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. నిత్యపూజలతో విరాలజిల్లుతున్న ఆలయంలో అడుగుపెట్టి పునీతులౌతున్నారు. కాశిలో మునక శ్రీకాళహస్తిలో అడుగుపెట్టడం ముక్తికి మార్గంగా



భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ప్రదాన ఆలయం కంచుగడప వద్దకు అడుగుపెట్టగానే గురువు దర్శనభాగ్యం లభిస్తుంది.

**దక్షిణామూర్తికి ప్రత్యేకాభిషేకాలు:**

ఇక్కడ వెలసిన దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు.ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళనాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదారులుగా కూడా ఉన్నారు.ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు.అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు.ఉదయం ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు,పెరుగు,పంచామృతం,చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి,కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్, ఎపిఆర్ఓ శ్రీనాథ్, స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు.పూజలు,అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

# అక్రమార్కులకు పాలసముద్రం ఎస్ఐ వత్తాసు

**- నేడు తెలుగుదేశం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా**

పాలసముద్రం, జులై 4 ప్రభాతవార్త:

మండలంలో అక్రమాలకు పాల్పడుతున్న వారికి పోలీసుల నుండి అభయహస్తం లభిస్తుంది. మండల పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు వెళ్ళి స్వయంగా పట్టుకొన్న దాఖలాలు ఇప్పటి వరకు లేదు. ఒక ప్రదేశంలో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించి అక్కడికి స్వయంగా పోలీసులను తీసుకెళ్ళి చూపించడంతో అప్పట్లో ఆగ్రహించిన ఒక జెసిబిని సీజ్ చేసిన పోలీసులు ఆపై దీనికి సంబంధించి కేసు నమోదు చేయకుండా గట్టు చప్పుడు కాకుండా సీజ్ చేసిన వాహనంను వదలిపెట్టడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ మేరకు శుక్రవారం పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్ణయించారు. కృష్ణజిమ్మాపురం గ్రామంలో గత శుక్రవారం కొంతమంది ఒక జెసిబితో అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తరలిస్తున్నారని మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజుకు సమాచారం అందింది. ఈ మేరకు ఆయన నేరుగా ఎస్ఐ వద్దకు వెళ్ళి ఆమెకు విషయం వివరించి పోలీసులను సంఘటనా స్థలం వద్దకు తీసుకెళ్ళడంతో పోలీసులు జెసిబిను సీజ్ చేసి స్టేన్‌కు తరలించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. అయితే వారం రోజుల పాటు స్టేసన్‌లో వుంచుకున్న జెసిబిని గురువారం ఎవరికి చెప్పకుండా జెసిబిని దాని యాజమానులకు అప్పగించారు. పోలీసులు ఈ వ్యవహారంలో జెసిబి యాజమానుల నుండి భారీగా వసూళ్ళకు పాల్పడ్డారని, తాము ప్రత్యక్షంగా అక్రమాలు జరుగుతున్నాయని తీసుకెళ్ళి చూపి జెసిబిని సీజ్ చేస్తే చర్యలు తీసుకోకుండా జెసిబిని ఎలా వదలి పెడుతారని తెలుగుదేశం నాయకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై శుక్రవారం ఉదయం 11 గంటలకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించడానికి రంగం సిద్దమైంది.